క్లుప్తంగా

డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులు జరుగుతున్న దృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామికవాడలో డ్రైనేజీ పనులను సర్పంచ్ శాంతాబాయి శనివారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 8 లక్షలు మంజూరు చేయించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ పాల్గొన్నారు.

లింగాల శివశంకర్‌రెడ్డిని కలిసిన మక్బూల్ అహ్మద్


లింగాల శివశంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డిని శనివారం అనంతపురంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మగ్బూల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివశంకర్ రెడ్డిని దుశ్శాలువాతో సన్మానించారు. సీనియర్ నాయకులు టీఎం మైనోద్దీన్, నాయుడు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


అక్షింతలు వితరణ చేస్తున్న దృశ్యం

నల్లమాడ: మండల కేంద్రంలో శనివారం అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ శ్రీరామ పూజిత అక్షింతలు వితరణ చేశారు. ఈ సందర్భంగా సీతారాముల చిత్రపటాన్ని ఊరేగిస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు. అక్షింతలతోపాటు సీతారాముల చిత్రపటాలు పంపిణీ చేశారు. ధర్మ ప్రచార బూరుగుల సుధాకర్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ ధూర్జటి లక్ష్మీనరసింహారావు, గోరంట్ల డివిజన్ ధర్మ ప్రచారకర్త లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం


వాసవీక్లబ్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శనివారం వాసవీ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోకా రవికుమార్, కార్యదర్శిగా వినయ్, కోశాధికారిగా కాకుమాని వెంకటసాయిని ఎంపిక చేశారు. వాసవీ క్లబ్ మాజీ డైరెక్టర్లు కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, దేవతా కృష్ణమూర్తి, అంబటి బద్రీనాథ్, ఇంటర్నల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దేవతా నాగసత్యశ్రీనివాస్, జోనల్ చైర్మన్ వంశీరామ్ పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' వైద్య సేవలు

తాడిమర్రి: మండలంలోని పుల్లానారాయణపల్లి, భీమరాయునిపేట గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవిలు రోగులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వికసిత్ భారత్‌పై అవగాహన


వాహనానికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

ముదిగుబ్బ: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పొడరాళ్లపల్లిలో శనివారం గ్రామస్తులకు సదస్సు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం పంట దిగుబడులు, ఎరువుల వినియోగం, డ్రోన్లతో క్రిమి సంహారక మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ లక్ష్మీ నరసింహులు, ఏపీఎం హేమలత, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి, బయపరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పథకాలే విజయసోపానాలు

- కదిరిలో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్
- కుటాగుళ్లలో ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు


కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేద్దామని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపు ఇచ్చారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డితో కలిసి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు గజమాలతో ఘన స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ఆటో స్టాండు నుంచి ర్యాలీగా సభ స్థలికి తీసుకెళ్లారు. మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారన్నారు. అందులో భాగంగా కదిరి అసెంబ్లీ స్థానాన్ని మైనార్టీలకు కేటాయించారన్నారు. జగనన్న తన నాలుగున్నర సంవత్సరాల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానన్నారు. సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధిద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సలీమ్, సురేష్‌రెడ్డి, బండారు మురళి, ఫయాజ్, ఓంప్రకాష్, నాయుడు, మోహన్‌రెడ్డి, నాగరాజు, కౌన్సిలర్ షబ్బీర్, ఖలంధర్, అల్తాప్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


కుటాగుళ్లలో వైఎస్సార్‌సీపీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పుతున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్


సైదాపురంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ లోకి చేరిక

కుటాగుళ్ల గ్రామంలో టీడీపీకి చెందిన కేవీ వంశీకృష్ణారెడ్డి(వంశీ) పవన్ కుమార్‌రెడ్డి, రవి, తాహీర్, బాబ్జాన్, సలీమ్, దివాకర్, ఆశీప్, రఘుతో సహా వందమంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, పూల శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సైదాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బండారు మురళి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ సమన్వకర్త కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యవర్గ సభ్యులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమంటపంలో శనివారం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా పబ్బితి మురళీమోహన్, కార్యదర్శిగా అశ్విన్‌కుమార్, కోశాధికారిగా నాగేంద్రకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా చంద్రశేఖర్‌గుప్తా, వెంకటేశ్వరరావ్, మేడా వరప్రసాద్, ఆనంద్‌బాబు, ధ్వనిత్ హాజరయ్యారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

గాండ్లపెంట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందాలు, పేకాట జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటనారాయణ శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో గట్టి నిఘా ఉంచామని తెలిపారు.

బత్తలపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. కోడి పందేలు నిర్వహించే ప్రదేశంలో భూ యజమానిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి పందేలు ఆడుతూ పట్టుబడితే శిక్షతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నగదును అందిస్తున్న హరీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఎన్పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని నడింబోటు కొండపై నిర్మించనున్న వైకుంఠనారాయణ స్వామి ఆలయానికి పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముసల్‌రెడ్డిగారి హరీష్‌రెడ్డి శనివారం రూ.10వేలు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎం.విశ్వనాథరెడ్డి, మహేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని దుగినేపల్లిలో నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి శనివారం రూ. 15 వేల విరాళాన్ని అందజేశారు.

ఆర్టీసీ బలోపేతానికి శ్రమించాలి


ఆర్టీసీ ఉద్యోగులకు నగదు బహుమతులు అందిస్తున్న డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: ఆర్టీసీని లాభాలబాట పట్టించేందుకు ఉద్యోగులు, కార్మికులు శ్రమించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఉద్యోగుల నిబద్ధత, శ్రమ, పట్టుదలతోనే ఆర్టీసీ రోజురోజుకు అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతిభ చూపిన ఉద్యోగులను ప్రోత్సహించేందుకు చిన్నపాటి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. కేఎంపీఎల్ తీసుకురావడంతోపాటు డీజిల్‌ను ఆదా చేసి సంస్థకు ఆదాయాన్ని తీసుకువస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు ఆంజనేయులు, నారాయణ, ఆంజనేయులు, కండక్టర్లు రామ్మోహన్, మధుసూదన్, ప్రసాద్, సీవీఆర్‌రెడ్డి, శ్రీనివాసులుకు బహుమతులు అందించారు. ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశులు, ఏఈ సికింధర్, టీఐ శ్రీరాములు, ఏడీసీలు ఎంసీజీరావు, మల్లికార్జున పాల్గొన్నారు.

కుష్టుపై అపోహలు వద్దు


సర్వే వివరాలను ఆరా తీస్తున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

ముదిగుబ్బ: కుష్టుపై అపోహలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కుష్టు, అంధత్వ నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ వైద్యులకు సూచించారు. కుష్టు వ్యాధిపై చేపట్టిన సర్వే వివరాలను ముదిగుబ్బ పీహెచ్‌సీలో శనివారం ఆయన పరిశీలించారు. సకాలంలో చికిత్స అందించడం ద్వారా వైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, వైద్యాధికారి రాజేంద్ర పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: ఎగువపల్లి చెక్‌పోస్ట్‌వద్ద శనివారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా రాప్తాడు మండలం యర్రగుంట్లకు చెందిన నరసింహులు, నరేష్‌లు బైక్‌పై వచ్చారు. తనిఖీ చేయగా 96 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించిందన్నారు.

తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని గంగంపల్లి సమీపంలోని తిరుమల దేవర ఆలయంలో వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయాన్నే స్వామివారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మండలవాసులే గాక, కర్ణాటక, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల వాసులు స్వామివారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వరస్వామికి రోజూ ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి

రొళ్ల: శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించనున్నట్లు ఆ ట్రస్ట్ కర్ణాటక రాష్ట్రం తుమకూరు, మధుగిరి, పావగడ ప్రాంతీయ సంచాలకులు దినేష్, రాజగోపాల్, మహేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో బ్రహ్మణ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న గాయత్రి దేవి ఆలయ నిర్మాణానికి ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ తరఫున రూ.రెండు లక్షల డీడీని అందజేశారు. ట్రస్ట్ తరఫున గ్రామాల్లో శుద్ధజల తాగునీటి ప్లాంట్, పేద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక సాయం, మహిళ సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.

బోగి, సంక్రాంతి శుభాకాంక్షలు


ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

పుట్టపర్తిటౌన్/ధర్మవరం/ కదిరిటౌన్/ కనగానపల్లి: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌లు శనివారం ప్రజలకు బోగి, మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి నవకాంతి నింపాలని, అన్నదాతల ఇళ్లు ధాన్యరాశులతో నిండాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్‌లు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రైలు నుంచి పడి యువకునికి తీవ్ర గాయాలు

తనకల్లు: కదులుతున్న రైలునుంచి పడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పరాకువాండ్లపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు.... చీరాలకు చెందిన ఏడుకొండలు కుటుంబంతో కలిసి ధర్మవరం పట్టణంలో బేల్దారి పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊరుకి వెళ్లడానికి ధర్మవరం నుంచి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. డోర్ వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నివాళులర్పించిన ఎమ్మెల్యే


సురేష్‌కుమార్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మండల కేంద్రంలోని మాడికవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి(58) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి భార్య ప్రభావతమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పణికుమార్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: చెర్లోపల్లిలో గుండెపోటుతో మృతిచెందిన దేవప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ నివాళులు అర్పించారు. శనివారం వారు గ్రామానికి చేరుకొని దేవప్రసాద్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

బత్తలపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఈ నెల 17, 18 తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ శనివారం తెలిపారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ స్థాయి అధికారులు శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నేతాజీ నగర్‌కు చెందిన వృద్ధుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వడ్డే పెద్దన్న (75) శనివారం ప్రమదవశాత్తూ చెరువులోకి జారిపడటంతో మృతి చెందాడు. వివరాలు.. పెద్దన్న బహిర్భూమికి మండల కేంద్రంలోని చెరువు వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

డ్రై ఫ్రూట్స్ అలంకారంలో శనీశ్వరుడు



పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో కొలువుదీరిన శాంత స్వరూపుడు శనీశ్వరస్వామి శనివారం డ్రై ఫ్రూట్స్ అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శివమొగ్గకు చెందిన శనీశ్వర స్వామి భక్తుడు మోహన్ కుమార్ కుటుంబ సభ్యులు స్వామిని డ్రై ఫ్రూట్స్ అలంకరణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా నవగ్రహాలకు నవనీత అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తైలాభిషకం, నవగ్రహాల పూజలు నిర్వహించారు.

ముంగిళ్లలో ముత్యాల రంగవల్లులు


బత్తలపల్లిలో అందంగా వేసిన ముగ్గు


పుట్టపర్తి మండలం కప్పలబండలో ముగ్గుల పోటీలు

బత్తలపల్లి: ధనుర్మాసంలో ముగ్గులు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. నెలంతా ముగ్గులు వేయడం ప్రారంభమై భోగి రోజుతో ముగియనుంది. పెళ్లీడు అమ్మాయిలు ముగ్గులు వేసి గొబ్బిళ్లతో పూజలు చేస్తే మంచి వరుడు లభిస్తాడని అండాళ్ తల్లి పావన చరిత ద్వారా తెలుస్తుంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతికి పూర్ణ కుంభం, కనుమకు రథం ముగ్గు వేయడం అనవాయితీ .

శాస్త్రీయ అంశాలెన్నో..

ముగ్గులు వేసే ప్రక్రియలో శాస్త్రీయ అంశాలున్నాయి. వ్యాయామం ద్వారా అదనపు ఆరోగ్యం సిద్ధిస్తుంది. పరిసరాల పరిశుభ్రం కావడం, అందంగా తీర్చిదిద్దడం కళా పోషణకు తార్కాణంగా ముగ్గులు నిలుస్తాయి. చుక్కల ముగ్గులు ద్రవిడ సంప్రదాయంగా, గీతల ముగ్గు ఆర్య సంప్రదాయంగానూ చూస్తారు. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా పురుగు పుట్రలకు ఆహారం వేయడమనే భావన కూడా ఉంది. ముగ్గు వేయడంలో సంస్కృతి, సైన్స్ రెండూ ఉన్నాయన్నమాట.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో ప్రభాత్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విదేశీయుల సహకారంతో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. గాయత్రి, నందిని, అనురాధలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా బహుమతులు అందజేశారు. సౌతాఫ్రికాకు చెందిన బాబా భక్తురాలు లలితా జవహరిలాల్, మౌనికా అన్నాముల్లర్, పీఆర్‌డీఎస్ ప్రతినిధి ప్రభాకరరెడ్డి, సర్పంచ్ చిన్నపెద్దన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు.విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. కరస్పాండెంట్ జగదీష్, ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు వాణి, గంగాదేవి పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

బత్తలపల్లి: సంక్రాంతి పండుగ సేవర్వంలో ఆదివారం సాయంత్రం బత్తలపల్లిలోని శివాలయం వద్ద శ్రీలలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వర ఆలయం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి శనివారం తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

ముదిగుబ్బ: స్థానిక ఎస్‌డీఆర్‌ఆర్ కాలేజీలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. శ్రీవిద్య, బ్రహ్మకీర్తి, నందినీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


ముదిగుబ్బ: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

న్యూస్ పేపర్లలో చూసి ముగ్గులు వేస్తున్నా..



ధనుర్మాసం కావడంతో న్యూస్ పేపర్లలో రకరకాల ముగ్గులు ప్రచురిస్తున్నారు. వాటిని ఆధారంగా చేసుకుని ముగ్గులను ప్రాక్టీస్ చేస్తున్నాం. పండుగ రోజు ఇంటి ముంగిట వేసే ముగ్గుకు ప్రాధాన్యత ఇస్తున్నాం.
–ప్రియాంక, గృహిణి, బత్తలపల్లి.

ముగ్గులు సంస్కృతికి ప్రతీకలు..



ముగ్గులు భారతీయ సంస్కృతికి ప్రతీకలు. అందుకే ముగ్గులు అద్దడమంటే ఎంతో ఆసక్తి చూపుతా. ఏడాదిలో సంస్కృతి పండుగ నాటి ముగ్గుకే ప్రాధాన్యత ఇస్తాం.
–అరుణాదేవి, గృహిణి, బత్తలపల్లి.